వీరాంజనేయ స్వామికి పట్టు వస్త్రాల సమర్పణ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయం శ్రీ వీరాంజనేయ స్వామికి పట్టు వస్త్రాలను ఆలయ ఈఓ వెంకటేశు, అధికారులు సమర్పించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో ఆలయ ఈఓ, అధికారులు ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారి పట్టు వస్త్రాలను తీసుకెళ్లి సమర్పించారు. శ్రీ వీరాంజనేయునికి రాత్రి ఆలయ అధికారులు, గ్రామోత్సవం నిర్వహించారు.
జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కుటుంబ సమేతంగా ఆదివారం స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.


పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న అధికారులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి వెంకటగిరి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం వాయుపుత్రునికి ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తులసీరామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

యాదమరి: మండలంలోని చెన్నారెడ్డి పల్లె ద్రౌపదీ ధర్మరాజుల ఆలయం వద్ద వెలసిన శ్రీ ఆంజనేయ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పెరుమాళ్ల పల్లెలో హనుమంతునిపై సీతారాములను కొలువు తీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించి, పురవీధుల్లో ఊరేగించారు.

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం పొన్నియమ్మ గుడివీధిలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది అభిషేక పూజలు నిర్వహించి వడమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి అర్చన కార్యక్రమాలు చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం



బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987–88లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. అప్పట్లో చదువు నేర్పిన గురువులు చంద్రన్, బాలసుబ్రమణ్యంను, పాఠశాల స్థలదాత మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, హెచ్‌ఎం బేరినాథ్‌ను పూర్వవిద్యార్థులు సన్మానించారు.



రూ.లక్ష విరాళం



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్యఅన్నదానానికి రూ.లక్ష విరాళం అందింది. ఆదివారం సాయంత్రం గుంటూరుకు చెందిన సాయినగేష్ కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారి నిత్య అన్నదానంకు రూ.లక్ష విరాళం అందించారు.

పొన్నియమ్మ ఆలయం కిటకిట

చిత్తూరు రూరల్: గంగజాతరను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీ పొన్నిమయ్మ ఆలయం ఆదివారం కిటకిటలాడింది. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ఆలయ ఆవరణంలో పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో తరించారు. వీరి రాకతో ఆలయం కిక్కిరిసింది. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు.

కార్పొరేషన్ కార్యాలయంలో...

చిత్తూరు అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సప్ – 98499 07885కు సమస్యలు తెలియజేయవచ్చని చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

బంగారుపాళెం: స్థానిక ఎన్‌పీసీ నాయుడు పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి డాక్టర్లు 85 మందికి పరీక్షలు నిర్వహించారు. 15 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి తిరుపతికి తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం



గుడిపాల: మండలంలోని వసంతాపురంలో ఆదివారం మహాభారత యజ్ఞం ఘనంగా ప్రారంభించారు. ఉదయం ద్రౌపది, ధర్మరాజుల ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి వేదపండితుల మధ్య ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి హరికథా భాగవతారిణి నాగరత్న హరికథ కాలక్షేపం సాగింది. రాత్రి ద్రౌపది, భీమ, అర్జున నకుల సహదేవుల విగ్రహాలతో వసంతాపురంలో బాణసంచా వేడుకల మధ్య ఊరేగింపు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల కలయిక



గుడిపాల:మండలంలోని నరహరిపేట ఉన్నత పాఠశాలలో 2003–04 లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకొని అనుభవాలను పంచుకుని సరదాగా గడిపారు.

నేడు మెడికల్ క్యాంప్

చిత్తూరు కార్పొరేషన్ : చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జన్మదినం సందర్భంగా సోమవారం పీసీఆర్ కళాశాలలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం మంత్రి అంబటి రాంబాబుతో కలిసి ఎమ్మెల్యే మెగా మెడికల్ క్యాంప్‌ని సందర్శిస్తారు.











